# నవతరం
నేటితరం కోసం...

హైదరాబాద్ | సోమవారం, జనవరి 26, 2026 | సంపుటి:11 | సంచిక :269 | పేజీలు: 4 | వెల : రూ.5




## సింగరేణి స్కామ్‌లో సీఎం రేవంత్ సూత్రధారి: హరీశ్

# ఆజాద్ హింద్‌గా అండమాన్ దీవుల పేరు మార్చండి

## ::: ప్రధాని మోడీకి లేఖ రాసిన కవిత



హైదరాబాద్, నవతరం: జాగృతి కార్యాలయంలో నేతాజీ జయంతి పాల్గొన్న ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు అండమాన్ నికోబర్ దీవులకు ఆజాద్ హిందూ పేరు పెట్టాలని తెలంగాణ జాగృతి అధినేత్రి, మాజీ ఎంపి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ను గౌరవిస్తూ అండమాన్ దీవులకు ఆ పేరు పెట్టాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఎప్పటి నుంచో  కోరుతున్నదని గుర్తు చేశారు. జాగృతి కూడా ఫార్వర్డ్ బ్లాక్ వాళ్ల డిమాండ్ ను సపోర్ట్ చేస్తోందని స్పష్టం చేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా తెలంగాణ జాగృతి ప్రధాన కార్యాలయంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నేతలు జోజిరెడ్డి, ఆర్వీఆర్ ప్రసాద్, తేజ్ దీప్ రెడ్డితో కలిసి జాగృతి అధ్యక్షురాలు నివాళి అర్పించారు. నేతాజీ ఫొటోకు పూలమాల వేసి ఆయన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. పేరు మార్పును కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఈ నెల 26 న ట్విట్టర్ లో హాష్ ట్యాగ్ మూమెంట్ ను నడిపిస్తామని కవిత వెల్లడించారు. జాగృతి నెట్ వర్కుతో దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఈ డిమాండ్ వచ్చేలా చేస్తామని చెప్పారు. నిజానికి అండమాన్ నికోబార్ పేరును బ్రిటీష్ వాళ్లు పెట్టారని తెలిపారు. వారి పేర్లను కొనసాగించకుండా మన వీరుడి పేరు ఆ ఐలాండ్ కు పెట్టాలన్నారు. బీజేపీ ప్రభుత్వం సుభాష్ చంద్రబోస్ గౌరవార్థం జనవరి 26 న అండమాన్ పేరు మార్చుతుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. స్వాతంత్రం కావాలంటే అది ఇస్తే రాదు, తీసుకోవాలని నేతాజీ దేశప్ఆరజలను చైతన్య పరిచారని చెప్పారు. యువత రక్తాన్ని ఇస్తే నేను స్వాతంత్రాన్ని తెస్తానని చెప్పారన్నారు. చాలా ఉన్నతమైన కుటుంబంలో పుట్టి మంచిగా స్థిరపడినప్పటికీ ఆయన స్వాతంత్ర్య పోరాటం చేశారని కవిత తెలిపారు. తండ్రి కోసం ఐఏఎస్ కూడా అయ్యారని, అప్పట్లోనే ఆరు పోస్టులకు గాను నాలుగో ర్యాంక్ తెచ్చుకున్నారని వివరించారు. కానీ ఐఏఎస్ గా ఉండి బ్రిటీష్ వాళ్ల కోసం

(మిగతా 2వ పేజీలో)



# బంగ్లాదేశ్‌లో మరో దారుణం

**నిద్రిస్తున్న హిందూ యువకుడి సజీవ దహనం..**

**మైనారిటీ హిందువులపై బంగ్లాదేశ్ లో ఆగని హింస**

**హిందూ యువకుడి షాపుకు నిప్పు పెట్టిన దుండగులు**

**యువకుడు చనిపోయాడని నిర్ధారించుకున్నాకే అక్కడి నుంచి వెళ్లిపోయిన వైనం**

బ్యూరో చీఫ్, నవతరం: బంగ్లాదేశ్ లో మరో ఘోరం చోటుచేసుకుంది. ఓ హిందూ యువకుడిని దుండగులు సజీవ దహనం చేశారు. శుక్రవారం రాత్రి నార్సింగ్ది ప్రాంతంలోని ఓ షాపులో చంచల్ భౌమిక్ (23) అనే యువకుడు నిద్రిస్తుండగా దుండగులు దాడి చేశారు. షాపు షట్టర్ మూసేసి పెట్రోల్ పోసి నిప్పంటించారు. మంటల వేడికి నిద్రలో నుంచి లేచిన చంచల్ బయటపడేందుకు విఫలయత్నం చేశాడు. చంచల్ మంటల్లో కాలి చనిపోయాడని నిర్ధారించుకున్నాకే దుండగులు అక్కడి నుంచి వెళ్లిపోయారని స్థానికులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

**కుటుంబానికి చంచలే ఆధారం..**

చంచల్ భౌమిక్ తండ్రి చాలాకాలం క్రితమే చనిపోయాడు. తల్లితో పాటు ఇద్దరు సోదరులను చంచల్ తన కష్టంతో పోషిస్తున్నాడు. ఇందుకోసం నార్సింగ్ది ప్రాంతంలోని గ్యారేజీలో చంచల్ ఆరేళ్లుగా పనిచేస్తున్నాడు. కాగా, చంచల్ ను దుండగులు పథకం ప్రకారమే చంపేశారని ఆయన కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తమ కుటుంబానికి ఉన్న ఒక్క ఆధారం కూడా పోయిందని చంచల్ తల్లి కన్నీటి పర్యంతమయ్యారు.

# 3 మృతదేహాలు వెలికితీత

**20 గంటలకు పైగా కొనసాగుతున్న సహాయక చర్యలు**

**సెల్లార్ గోడలకు రంధ్రాలు చేసి మృతదేహాల వెలికితీత**

**దట్టమైన పొగ, ఫర్నీచర్‌తో సహాయక చర్యలకు ఆటంకం**



హైదరాబాద్, నవతరం: హైదరాబాద్‌లోని నాంపల్లిలో జరిగిన అగ్నిప్రమాద ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. దాదాపు 20 గంటలకు పైగా కొనసాగుతున్న సహాయక చర్యల్లో మూడు మృతదేహాలను సిబ్బంది వెలికితీశారు. భవనంలోని సెల్లార్‌లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు గోడలకు రంధ్రాలు చేసి లోపలికి ప్రవేశించిన రెస్క్యూ బృందాలు, ముగ్గురి మృతదేహాలను గుర్తించాయి. మిగిలిన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. సెల్లార్ మొత్తం ఫర్నీచర్‌తో నిండి ఉండటం, దట్టమైన పొగ అలుముకోవడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దీంతో లోపల చిక్కుకున్న వారిని కాపాడేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

**అక్రమ కట్టడాలపై మానవ హక్కుల కమిషన్ ఆగ్రహం**

ఈ ప్రమాద ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్‌హెచ్‌ఆర్‌సీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నగరంలో అక్రమ కట్టడాల వల్లే ఇలాంటి ఘోర ప్రమాదాలు పదేపదే జరుగుతున్నాయని మండిపడింది. అధికారులు నిర్లక్ష్యం వీడి కఠిన చర్యలు తీసుకోవాలని కమిషన్ సూచించింది.



# శుభాంశు శుక్లాకు అశోక చక్ర

# సింగరేణి ప్రైవేటీకరణకు తావులేదు



**సంస్థను రాజకీయాలకు అతీతంగా కాపాడుకోవాలని కిషన్‌రెడ్డి వ్యాఖ్య**

**విదేశీ బొగ్గు దిగుమతులు తగ్గించడమే కేంద్ర లక్ష్యమన్న మంత్రి**

**కార్మికులకు లాభాలు అందాలన్నదే మోదీ ఆలోచన అని స్పష్టం**

**లెఫ్ట్ పార్టీల విమర్శలు ఉనికి కోసమేనని ఆరోపణ**


## ది హోమ్ ఫర్ ఆర్ఫన్ స్టూడెంట్స్ | THE HOME FOR ORPHAN STUDENTS

Plot No. 174 to 176, Phase -1 B.N. Reddy Nagar,, OPP. ICOMM, Cherlapally, Hyderabad - 500 051.



పదవ తరగతి పై బడిన చదువుతున్న ఇంటర్మీడియట్/ఐ.టి.ఐ/ పాలిటిక్నిక్/ డిగ్రీ/ ఇంజనీరింగ్/ పారా మెడికల్ కోర్సులు/ పి.జి కోర్సులు.

A golden Opportunity for Orphaned and underprivileged students studying Intermediate, ITI, Polytechnic, Degree, Engineering, Paramedical, or PG Courses after completing 10th class.

హైదరాబాద్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న అనాథ/ పేద విద్యార్థులకు సువర్ణ అవకాశం.

Students Studying in Government or Private Colleges in Hyderabad are Eligible.

మానవత్వం సహృదయం గల దాతల హార్థిక, ఆర్థిక సహాయ సహకారాలతో నిర్వహించబడుచున్న సంస్థ. గత 30 సం॥లలో సుమారు 400 మంది విద్యార్థులు ఈ హోమ్‌లో చదివి మంచి ఉద్యోగాలు సంపాదించి జీవితంలో స్థిరపడినారు.

With the support of kind-hearted and humanitarian donors, an organization is being run since last 30years about 400plus students studied and well setteled down happily in life.

బాలురకు మాత్రమే

ఉచిత వసతి, భోజనం, బస్‌పాస్, సౌకర్యాలతో

SCAN HERE For ADDRESS

ONLY FOR BOYS

Free Accommodation
Free Meals
Free Bus Pass
Other Essential Facilities.

అడ్మిషన్ల కొరకు పైన పేర్కొన్న అడ్రస్ లో సంప్రదించగలరు. | For Addmissions Please Contact the Address Mentioned Above

Cell: 9391221697

# సింగరేణి ప్రైవేటీకరణకు తావులేదు

**సంస్థను రాజకీయాలకు అతీతంగా కాపాడుకోవాలని కిషన్‌రెడ్డి వ్యాఖ్య**

**విదేశీ బొగ్గు దిగుమతులు తగ్గించడమే కేంద్ర లక్ష్యమన్న మంత్రి**

**కార్మికులకు లాభాలు అందాలన్నదే మోదీ ఆలోచన అని స్పష్టం**

**లెఫ్ట్ పార్టీల విమర్శలు ఉనికి కోసమేనని ఆరోపణ**

**పీవీకే5 గనిలో కార్మికులతో ఆత్మీయ సమావేశం**



రుద్రంపూర్, జనవరి 26 : సింగరేణి కాలరీస్ సంస్థను ప్రైవేటుపరం చేసే ప్రసక్తే లేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. సంస్థ ప్రైవేటీకరణపై జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని ఆయన తేల్చిచెప్పారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రుద్రంపూర్‌లోని పీవీకే5 భూగర్భ గనిలో కార్మికులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇల్లెందు క్లబ్‌లో కార్మిక సంఘాలు, బీఎంఎస్ నాయకులు, సింగరేణి అధికారులు పాల్గొన్న సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. సింగరేణి లాభాలు ముందుగా కార్మికులకు అందాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనా విధానమని చెప్పారు. దేశంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌లో సుమారు 74 శాతం సింగరేణి బొగ్గుపైనే ఆధారపడి ఉందని, అనేక పరిశ్రమలు కూడా ఈ సంస్థపై ఆధారపడి నడుస్తున్నాయని తెలిపారు. సింగరేణి సంస్థను రాజకీయాలకు అతీతంగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కిషన్‌రెడ్డి సూచించారు. దేశానికి ప్రతి సంవత్సరం విదేశాల నుంచి సుమారు రూ.700 కోట్ల విలువైన బొగ్గు దిగుమతి అవుతోందని, దీన్ని తగ్గించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. బొగ్గు నాణ్యతను మెరుగుపరిస్తే దిగుమతులు తగ్గి, భవిష్యత్తులో ఎగుమతులకు కూడా అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు, హైపవర్ వేతనాలు అందేలా కృషి చేస్తానని కిషన్‌రెడ్డి తెలిపారు. సంస్థకు రావాల్సిన బకాయిల వసూలు, కొత్త గనుల ప్రారంభం, ఉపాధి అవకాశాల విస్తరణపై కేంద్రం దృష్టి సారిస్తుందని చెప్పారు. సింగరేణి అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలను చేపడతామని హామీ ఇచ్చారు. తెలంగాణలో లెఫ్ట్ పార్టీలు తమ ఉనికిని చాటుకునేందుకే సింగరేణి అంశంపై విమర్శలు చేస్తున్నాయని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఒకప్పుడు 50 సీట్ల వరకు గెలిచిన లెఫ్ట్ పార్టీలు నేడు ఇతర పార్టీలపై ఆధారపడి ఒకటి, రెండు సీట్లకే పరిమితమయ్యాయని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను రెండు తోడు దొంగలుగా ఆయన అభివర్ణించారు. సింగరేణి నిధులను దుర్వినియోగం చేస్తున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వంపై కూడా మంత్రి విమర్శలు గుప్పించారు. కార్మికుల సొమ్మును ఇతర కార్యక్రమాలకు ఖర్చు చేసే అధికారం ముఖ్యమంత్రికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. సింగరేణి కార్మికుల ప్రయోజనాలే కేంద్ర ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సీఎండీ కృష్ణభాస్కర్, డైరెక్టర్ (పర్సనల్) గౌతం పోట్రు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగంపై బీజేపీ బుల్డోజర్

**లౌకికత్వం, ప్రజాస్వామ్య విలువలను కూల్చే ప్రయత్నమంటూ ఐద్వా విమర్శ**

**మహిళలకు అతిపెద్ద ముప్పు బీజేపీఆర్ఎస్ఎస్ నుంచేనని వ్యాఖ్య**

**గణతంత్ర దినోత్సవ సెల్యూట్ ప్రజల కోసం కాదన్న బృందాకారత్**

**మైక్రో ఫైనాన్స్ పేరుతో పేద మహిళలను అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపణ**

**హైదరాబాద్‌లో ఐద్వా జాతీయ మహాసభల సందర్భంగా భారీ ర్యాలీ**



హైదరాబాద్, జనవరి 26 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తూ లౌకికత్వం, ప్రజాస్వామ్యం, సమానత్వం వంటి మౌలిక విలువలపై బుల్డోజర్ నడుపుతోందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ ప్యాట్రన్ బృందాకారత్ తీవ్రంగా విమర్శించారు. దేశానికి అతిపెద్ద ప్రమాదం బీజేపీ, ఆర్ఎస్ఎసేనని ఆమె వ్యాఖ్యానించారు. నగరంలోని బస్‌భవన్ మైదానంలో ఆదివారం ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో బృందాకారత్ మాట్లాడుతూ.. రాజ్యాంగం హామీ ఇచ్చిన లౌకికత, ప్రజాస్వామ్య విలువలను కేంద్ర ప్రభుత్వం వ్యవస్థాగతంగా ధ్వంసం చేస్తోందని అన్నారు. అధికార బలంతో ప్రజల హక్కులను తొక్కేస్తోందని విమర్శించారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ఇండియా గేట్ వద్ద తీసుకునే సెల్యూట్ రాజ్యాంగం కోసం కాదని, ప్రజల కోసం కూడా కాదని ఆమె ఆరోపించారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్ఎస్ఎస్ ఆలోచనలకే ఆ సెల్యూట్ అంకితమవుతుందని ధ్వజమెత్తారు. మహిళల భద్రత, హక్కుల విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. దేశంలో మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ వాటన్నింటికన్నా ప్రమాదకరంగా రాజ్యాంగానికి ఏర్పడుతున్న ముప్పే అత్యంత ఆందోళన కలిగిస్తోందని బృందాకారత్ అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే మహిళా ఉద్యమాల ప్రధాన లక్ష్యమని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు ఐద్వా ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయాలనే ప్రయత్నాలు పేదల జీవనాధారాన్ని దెబ్బతీస్తాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**మహిళలను అప్పుల ఊబిలోకి నెట్టుతున్నారు**

ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే మాట్లాడుతూ.. దేశంలోని పేద మహిళలకు ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. పనిలేని పరిస్థితుల్లో కుటుంబాన్ని ఎలా పోషించాలన్న ప్రశ్నను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల డిపాజిట్లను మైక్రో ఫైనాన్స్ సంస్థలకు మళ్లించి, అవే సంస్థలు పేద మహిళలకు అధిక వడ్డీతో రుణాలు ఇస్తున్నాయని ఆరోపించారు. వడ్డీలు చెల్లించలేక అనేక మంది మహిళలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పీకే శ్రీమతి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల మహిళల అభివృద్ధి వెనక్కి వెళుతోందన్నారు. మహిళా అక్షరాస్యత గణనీయంగా పడిపోయిందని పేర్కొన్నారు. ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు సుభాషిణి మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో మహిళల జీవన స్థితిగతులు మరింత దిగజారుతున్నాయని విమర్శించారు. ఈ బహిరంగ సభలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి ప్రసంగించారు. బహిరంగ సభకు ముందు ఆర్టీసీ కళ్యాణ మండపంలో ఐద్వా 14వ జాతీయ మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలు రాజకీయ, సామాజిక అంశాలపై తీర్మానాలు చేశారు. జాతీయ మహాసభల ప్రారంభ కార్యక్రమాన్ని ప్రముఖ నటి, స్క్రీన్ రైటర్ రోహిణి మొల్లెటి ప్రారంభించగా, ప్రొఫెసర్ శాంతసిన్హా హాజరైన ప్రతినిధులకు స్వాగతం పలికారు. అనంతరం సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి చిక్కడపల్లి మీదుగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వరకు ఎర్రజెండాలతో మహిళలు భారీ ర్యాలీగా తరలివెళ్లారు.



# ముగ్గురు చిన్నారులను బలితీసుకున్న సెల్ఫీ సరదా

**బామ్మను చూసేందుకు సిటీ నుంచి పల్లెకు వచ్చిన ముగ్గురు చిన్నారులు**

**పొలం వద్ద ఫోటోలు దిగుతుండగా కాలుజారి నీటి గుంతలో పడిపోయిన వైనం**

**ఈత రాకపోవడంతో కళ్లముందే ప్రాణాలు పోతున్నా కాపాడుకోలేకపోయిన తండ్రి**

నాగర్‌కర్నూల్ జిల్లా ముచ్చర్లపల్లిలో ఆదివారం జరిగిన విషాద ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు నీటి గుంతలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. హైదరాబాద్‌లోని తుర్కయాంజల్‌లో నివసించే శ్రీకాంత్‌రెడ్డి తన తల్లి సరస్వతమ్మను చూసేందుకు భార్యాపిల్లలతో కలిసి శనివారం స్వగ్రామమైన ముచ్చర్లపల్లికి వచ్చారు. ఆదివారం సరదాగా గడిపేందుకు పిల్లలతో కలిసి పొలానికి వెళ్లారు. అక్కడ నీటి గుంత పక్కన ఫోటోలు దిగుతున్న సమయంలో, శ్రీమాన్యు (12) ఒక్కసారిగా కాలుజారి నీటిలో పడిపోయాడు. తమ్ముడిని కాపాడే ప్రయత్నంలో అక్క శ్రీకృతి (14), మేనత్త కూతురు స్నేహ (17) కూడా నీటిలోకి దిగి మునిగిపోయారు. మరో బాలిక విద్యాధరణిని తండ్రి శ్రీకాంత్‌రెడ్డి సకాలంలో బయటకు లాగగలిగినా, మిగిలిన ముగ్గురిని కాపాడలేకపోయారు. తనకు ఈత రాకపోవడంతో, తన కళ్లముందే బిడ్డలు ప్రాణాలు విడుస్తున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఆయన ఉండిపోవడం అక్కడి వారిని కలిచివేసింది. శ్రీమాన్య 6వ తరగతి, శ్రీకృతి 8వ తరగతి చదువుతుండగా, స్నేహ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. చదువుల్లో ఎంతో చురుగ్గా ఉండే ఈ ముగ్గురు చిన్నారులు విగతజీవులుగా పడి ఉండటం చూసి గ్రామస్థులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కల్వకుర్తి ఆసుపత్రిలో పోస్టుమార్టం ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి బాధితులను పరామర్శించి ప్రభుత్వం తరపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



# సముద్రంలో మునిగిన ఫెర్రీ.. 13 మంది జలసమాధి, వంద మందికి పైగా గల్లంతు

**ఫిలిప్పీన్స్‌లో 300 మందితో వెళ్తూ మునిగిన ఫెర్రీ**

**244 మందిని కాపాడిన సహాయక బృందాలు**

**కొనసాగుతున్న సహాయక చర్యలు**

దక్షిణ ఫిలిప్పీన్స్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. 300 మందికి పైగా ప్రయాణికులు, సిబ్బందితో వెళ్తున్న ఒక ఫెర్రీ (ప్యాసింజర్ పడవ) సోమవారం తెల్లవారుజామున సముద్రంలో మునిగిపోయింది. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 13 మంది మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. మరోవైపు, సహాయక బృందాలు 244 మందిని సురక్షితంగా కాపాడగలిగాయి. జాంబోంగా నగరం నుంచి సులు ప్రావిన్స్‌లోని జోలో ద్వీపానికి ఈ ఫెర్రీ బయలుదేరింది. మార్గమధ్యలో బాసిలన్ ప్రావిన్స్‌లోని బలుక్‌బలుక్ ద్వీపం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే కోస్ట్ గార్డ్ యూనిట్లు, నౌకలు, సమీపంలోని మత్స్యకారులు సహాయక చర్యలు ప్రారంభించారు. ఇప్పటివరకు 13 మృతదేహాలను వెలికితీశారు. గల్లంతైన వారి సంఖ్య ఇంకా కచ్చితంగా తెలియరాలేదు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియలేదని, దీనిపై దర్యాప్తు జరుపుతామని అధికారులు తెలిపారు. జాంబోంగా పోర్టు నుంచి బయలుదేరే ముందు కోస్ట్ గార్డ్ అధికారులు ఫెర్రీని తనిఖీ చేశారని, అప్పుడు ఓవర్‌లోడింగ్ సంకేతాలు ఏవీ లేవని స్పష్టం చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ గాలి, సముద్ర మార్గాల ద్వారా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఫిలిప్పీన్స్‌లో తరచూ తుఫానులు, పడవల నిర్వహణ లోపాలు, నిబంధనలను సరిగా అమలు చేయకపోవడం వంటి కారణాలతో సముద్ర ప్రమాదాలు సర్వసాధారణంగా మారాయి. 1987లో జరిగిన డోనా పాజ్ ఫెర్రీ ప్రమాదంలో 4,300 మందికి పైగా మరణించడం ప్రపంచంలోనే అతిపెద్ద సముద్ర ప్రమాదంగా నమోదైంది.

# ఆజాద్ హింద్‌గా అండమాన్ దీవుల పేరు మార్చండి

నా దేశ పౌరులను ఇబ్బంది పెట్టలేనన్న ఆలోచనతో ఐఏఎస్ ను వదిలేసి అజాద్ హిందూ ఫౌజ్ ను ఏర్పాటు చేశారని చెప్పారు. దేశం బయటకు పంపించిన తర్వాత కూడా బయట ఉండి స్వాతంత్ర్య పోరాటం చేశారని తెలిపారు. ఆవేశం మాత్రమే కాకుండా దౌత్యపరంగా కూడా చాలా తెలివిగా పనిచేశారని గుర్తు చేశారు. దేశం బయట ఉండి కూడా బ్రిటీష్ వాళ్లకు వ్యతిరేకంగా ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టారన్నారు.

**సైన్యంలో మహిళలకు ప్రాధాన్యం**

లక్ష్య శుద్ధి, చిత్త శుద్ధి ఉన్న నాయకులంతా కూడా నేతాజీని స్ఫూర్తిగా తీసుకోవాలని కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. ఇప్పుడున్న ప్రభుత్వాలు మహిళలు రోడ్లు ఎక్కితే గానీ మాకు ఇచ్చే 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వలేదని, కానీ ఆ రోజుల్లో ఝాన్సీ లక్ష్మీబాయి పేరుతో మహిళలకు సైన్యంలో నేతాజీ అవకాశం ఇచ్చారన్నారు. మహిళలకు గన్ ఇచ్చి పోరాటం చేయాలని ఆయన ధైర్యం చెప్పారని కవిత తెలిపారు. నేతాజీ మన దేశం గర్వించదగ్గ మన సంపద అని, ఆయన స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చే ముందు అప్పటి బ్రిటీష్ ప్రధాని అట్లీ సైతం నేతాజీ గొప్పతనాన్ని వివరించారని కవిత తెలిపారు. నేతాజీ ఏర్పాటు చేసిన అజాద్ హిందూ ఫౌజ్ కూడా మమ్మల్ని భయపెట్టిందని అట్లీ అన్నారని తెలిపారు. అలాంటి గొప్ప నాయకులను గౌరవించుకునేలా ఆయన పేరును అండమాన్ దీవులకు పెట్టుకోవాలని కవిత కోరారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో హైదరాబాద్ పేరును భాగ్యనగరంగా మార్చుతామని బీజేపీ చెప్పిందని, కానీ అది రాజకీయ ప్రయోజనాల కోసం వాళ్లు టెంపరరీగా హడావుడి చేశారని విమర్శించారు. నేతాజీ లాంటి నాయకుల లెగసీని కాపాడుకునేందుకు కచ్చితంగా అండమాన్ నికోబార్ దీవులకు అజాద్ హిందూ పేరు పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు.

# సింగరేణి స్కామ్‌లో సీఎం రేవంత్ సూత్రధారి: హరీశ్

**సీఎం రేవంత్ సూత్రధారని, ఆయన బావమరిది లబ్ధిదారుడని ఆరోపణ**

**సైట్ విజిట్ సర్టిఫికెట్ టెండర్లను రద్దు చేసి, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్**

**సింగరేణి లాభాలను దాచిపెట్టి కార్మికుల బోనస్ తగ్గించారని విమర్శ**

**అవినీతిపై కేంద్రం మౌనం వీడాలని, బీజేపీ-కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయని ఆరోపణ**

సింగరేణి కాలరీస్‌లో భారీ అవినీతి జరిగిందని, దీని వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. 'సైట్ విజిట్ సర్టిఫికెట్' నిబంధనతో జారీ చేసిన టెండర్లన్నింటినీ తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ కుంభకోణంపై జ్యుడీషియల్ లేదా సీబీఐ విచారణ జరపాలని కోరారు. ఈ కుంభకోణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే సూత్రధారి అని, ఆయన బావమరిది సృజన్ రెడ్డి ప్రధాన లబ్ధిదారుడని హరీశ్ రావు ఆరోపించారు. నైనీ టెండర్‌ను రద్దు చేయడమే ఇందులో తీవ్ర అక్రమాలు జరిగాయనడానికి నిదర్శనమని అన్నారు. సీఎంకు సన్నిహితులైన కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చేందుకే టెండర్ నిబంధనలను మార్చారని విమర్శించారు. జనవరి 2025లో ఎలాంటి సైట్ విజిట్ నిబంధన లేకుండా అంచనా వ్యయం కంటే 7 శాతం తక్కువకు ఖరారైన భూపాలపల్లి పనుల టెండర్లను, మూడు నెలల్లోనే మే 2025లో కొత్త నిబంధనలతో ఎందుకు జారీ చేశారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఈ మార్పుల వల్ల పోటీ తగ్గి, సీఎం బంధువుకు చెందిన కంపెనీకి అంచనా కంటే ఎక్కువ ధరకు పనులు అప్పగించారని ఆరోపించారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానంతో మొదటి లబ్ధి పొందింది సృజన్ రెడ్డికి చెందిన 'శోధా కన్‌స్ట్రక్షన్స్' అని ఆయన పేర్కొన్నారు. అవినీతిపై సూటిగా సమాధానం చెప్పకుండా, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంబంధం లేని పత్రాలు చూపి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని హరీశ్ రావు విమర్శించారు. కుంభకోణానికి బాధ్యులెవరు, ఎంత నష్టం వాటిల్లింది, ఎవరు లబ్ధి పొందారనే మూడు ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. సింగరేణికి వచ్చిన సుమారు రూ. 6,900 కోట్ల లాభాలను కాంగ్రెస్ ప్రభుత్వం దాచిపెట్టి, కార్మికుల బోనస్‌ను తగ్గించిందని కూడా ఆయన ఆరోపించారు. సింగరేణిలో 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఈ అవినీతిపై మౌనంగా ఉండటం అనుమానాలకు తావిస్తోందని, సింగరేణిని ప్రైవేటీకరించేందుకు కాంగ్రెస్, బీజేపీలు కలిసి పనిచేస్తున్నాయని విమర్శించారు.

# శుభాంశు శుక్లాకు అశోక చక్ర

న్యూఢిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో అడుగు పెట్టిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన వాయుసేన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాకు ప్రభుత్వం అత్యున్నత సాహస పురస్కారం అశోక చక్రను ప్రకటించింది. ఎస్‌యూ30 ఎంకేఐ, మిగ్21, మిగ్ 29, జాగ్వార్, హాక్, డార్నియర్, ఏఎన్32 వంటి యుద్ధ విమానాలను నడిపిన శుక్లాకు 2 వేల గంటల ఫ్లయిట్ అనుభవముంది. శుక్లా గతేడాది జూన్‌లో యాగ్జియం4 మిషన్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లి 18 రోజులు గడపడం తెలిసిందే. తొలిసారిగా 1984లో రష్యా సూయుజ్ మిషన్‌లో రాకేశ్ శర్మ రూపంలో భారత వ్యోమగామి అంతరిక్షంలోకి వెళ్లగా..41 ఏళ్ల తర్వాత శుభాంశు ఆ ఘనత సాధించి రికార్డు నెలకొల్పారు. తాజాగా, రాష్ట్రపతి ముర్ము ప్రకటించిన 70 మంది సాహస అవార్డు గ్రహీతల్లో ఆయన కూడా ఉన్నారు. వీరి ఆరుగురికి మరణానంతరం పురస్కారం ప్రకటించారు. మేజర్ అర్షదీప్‌సింగ్, గ్రూప్ కెప్టెన్ బాలకృష్ణన్ నాయర్, నాయబ్ సుబేదార్ డోలేశ్వర్ సుబ్బాకు కీర్తిచక్ర ప్రకటించారు.

# నెల్లూరు జిల్లాలో ఏసీబీ సోదాల కలకలం

**నాయుడుపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఘటన**

**సీఐ బాబీ ఆదేశాల మేరకు మద్యం వ్యాపారుల నుంచి లక్ష లంచం డిమాండ్ చేసిన హెచ్‌సీ రామ్మోహన్ రాజు**

**మద్యం వ్యాపారుల నుంచి రూ.30వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న వైనం**




నెల్లూరు జిల్లా నాయుడుపేటలో మద్యం వ్యాపారులకు సంబంధించిన వ్యవహారంలో పోలీసుల లంచగొండితనం వెలుగులోకి రావడంతో కలకలం రేగింది. నాయుడుపేట అర్బన్ సీఐ బాబీ, హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్ రాజు మద్యం వ్యాపారులను లంచం డిమాండ్ చేసినట్లు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఫిర్యాదు అందింది. సీఐ బాబీ రూ.1 లక్ష లంచం కోరగా, ఆయన ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్ రాజు మద్యం వ్యాపారుల నుంచి రూ.30 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం తీసుకున్న హెడ్ కానిస్టేబుల్‌తో పాటు ఈ వ్యవహారానికి ప్రధాన సూత్రధారిగా ఉన్న సీఐ బాబీని కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులను ఏసీబీ అధికారులు తనిఖీ చేశారు. ఈ కేసులో మరి కొందరి సిబ్బంది పాత్ర ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. ఈ ఆకస్మిక ఏసీబీ దాడులతో జిల్లాలోని ఇతర పోలీస్ స్టేషన్లలో అధికారులు, సిబ్బంది ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు.

# రాజకీయ సమీకరణాలకు కొత్త సవాల్

### మున్సిపల్ ఎన్నికల్లో
### కల్వకుంట్ల కవిత నిర్ణయం హాట్ హాట్




హైదరాబాద్, నవతరం: రాష్ట్ర రాజకీయాల్లో మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడూ కేవలం స్థానిక పాలనకే పరిమితమవ్వవు. అవి పార్టీల బలాబలాలను పరీక్షించే మైదానాలుగా మారతాయి. అటువంటి కీలక సమయంలో కల్వకుంట్ల కవితమ్మ తీసుకున్న తాజా నిర్ణయం రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. నిన్న మొన్నటి వరకు ఏ పార్టీ ఎంతమంది స్థానాలు దక్కించుకుంటుంది, ఎవరితో పొత్తులు పెట్టుకోవాలి, ఎక్కడ బలహీనతలు ఉన్నాయన్న లెక్కలతో అన్ని పార్టీలు ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్న వేళ, కవితమ్మ వేసిన ఈ రాజకీయ "బాంబ్" అన్ని అంచనాలను తలకిందులు చేసేలా ఉంది. దీంతో ఇప్పటివరకు కుదుర్చుకున్న లెక్కలు ఇక పనికిరావన్న ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిణామం ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ నేతల్లో వెన్నులో వణుకు పుట్టిస్తోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కారణం లేకపోలేదు. గతంలో బీఆర్ఎస్‌జాగృతి కలిసి పని చేయడం వల్ల జాగృతి కి ఎక్కువ ఆకర్షితులు అయ్యేది బీఆర్ఎస్ కార్యకర్తలే, ఇప్పుడు జాగృతి పోటీ చేయడం వల్ల బీఆర్ఎస్ అభ్యర్థుల పైన ఎంత ప్రభావం చూపిస్తుంది అన్న భయం స్పష్టంగా కనిపిస్తోంది. ఇంకో ముఖ్యమైన అంశం ఏమిటంటే, ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసినా తగిన అవకాశాలు దక్కని నాయకులు, కార్యకర్తలు ఇప్పుడు జాగృతి వైపు చూసే అవకాశాలు పెరిగాయి. ఇతర పార్టీలతో పోలిస్తే జాగృతితో వారికి ఉన్న పాత సాన్నిహిత్యం, భావజాల సమీపత ఇందుకు కారణంగా మారుతోంది. ఇది బీఆర్ఎస్‌లో అంతర్గత అసంతృప్తిని మరింత పెంచే అవకాశముంది. ఇలాంటి పరిస్థితుల్లో జాగృతి మున్సిపల్ ఎన్నికల ద్వారా నేరుగా రాజకీయ రంగప్రవేశం చేయడం ఏ పార్టీకి ఎంత నష్టం కలిగిస్తుందో అన్న అంశం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తికర చర్చగా మారింది. బీఆర్ఎస్‌కు మాత్రమే కాకుండా ఇతర పార్టీల ఓటు బ్యాంకులపై కూడా ఈ ప్రభావం ఎలా ఉంటుందో చూడాల్సి ఉంది. ఏదేమైనా, కల్వకుంట్ల కవిత నిర్ణయం మున్సిపల్ ఎన్నికలను సాదాసీదా స్థానిక పోరాటం నుంచి రాష్ట్ర రాజకీయాలకు దిశానిర్దేశం చేసే కీలక ఘట్టంగా మార్చిందనడంలో సందేహం లేదు. రాబోయే రోజుల్లో ఈ నిర్ణయం ఏ రాజకీయ సమీకరణాలను మార్చబోతోందో, ఎవరి లెక్కలు ఎంత మేర తారుమారవుతాయో చూడటం రాష్ట్ర రాజకీయాలకు మరింత ఉత్కంఠను కలిగించనుంది.

# ఎవరీ జగదీశ్ ప్రసాద్ అహిర్వార్

**మన్ కీ బాత్‘లో ఫారెస్ట్ గార్డ్‌ను కొనియాడిన ప్రధాని మోదీ..**

**125కు పైగా ఔషధ మొక్కల వివరాలు నమోదు చేసిన అహిర్వార్**

**అహిర్వార్ కృషిని పుస్తకంగా ప్రచురించిన మధ్యప్రదేశ్ అటవీ శాఖ**

**పర్యావరణ పరిరక్షణకు ‘ఏక్ పేడ్ మా కే నామ్‘ ప్రచారం**

**దేశవ్యాప్తంగా 200 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు వెల్లడి**



హైదరాబాద్ / మధ్యప్రదేశ్, నవతరం: ప్రధాని నరేంద్ర మోదీ తన నెలవారీ రేడియో కార్యక్రమం ‘మన్ కీ బాత్‘ 130వ ఎపిసోడ్‌లో పర్యావరణ పరిరక్షణకు అంకితమైన ఒక సామాన్య ఫారెస్ట్ గార్డ్ స్ఫూర్తిదాయక కథను దేశ ప్రజలతో పంచుకున్నారు. మధ్యప్రదేశ్‌లోని పన్నా జిల్లాకు చెందిన ఫారెస్ట్ బీట్ గార్డ్ జగదీశ్ ప్రసాద్ అహిర్వార్ చేసిన అసాధారణ కృషిని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. పన్నా టైగర్ రిజర్వ్ పరిధిలోని దట్టమైన అడవుల్లో విధులు నిర్వర్తించే అహిర్వార్, ఒక కీలకమైన విషయాన్ని గుర్తించారు. తరతరాలుగా వస్తున్న ఔషధ మొక్కల పరిజ్ఞానం రాతపూర్వకంగా లేకపోవడంతో అంతరించిపోయే ప్రమాదంలో ఉందని ఆయన గ్రహించారు. ఈ వారసత్వ సంపదను భవిష్యత్ తరాలకు అందించాలనే సంకల్పంతో ఆ మొక్కల వివరాలను నమోదు చేసేందుకు స్వయంగా నడుం బిగించారు. ఈ క్రమంలో అహిర్వార్ అడవిలో ఉన్న 125కు పైగా ఔషధ మొక్కలను గుర్తించారు. వాటి ఫొటోలు, స్థానిక పేర్లు, సాంప్రదాయ ఉపయోగాలు, అవి లభించే ప్రదేశాల వివరాలను ఎంతో శ్రద్ధతో సేకరించారు. జీర్ణ సంబంధిత సమస్యల నుంచి చర్మ వ్యాధుల వరకు అనేక రుగ్మతలను నయం చేసే ఈ మొక్కల సమాచారం ఎంతో విలువైందని ప్రధాని పేర్కొన్నారు.


**ఒక సమగ్ర పుస్తకంగా అహిర్వార్ సేకరించిన డేటా**

అహిర్వార్ కృషిని గుర్తించిన మధ్యప్రదేశ్ అటవీ శాఖ, ఆయన సేకరించిన డేటాను ఒక సమగ్ర పుస్తకంగా ప్రచురించింది. ఈ పుస్తకం ఇప్పుడు పరిశోధకులకు, వృక్షశాస్త్రవేత్తలకు అమూల్యమైన వనరుగా మారిందని ప్రధాని వివరించారు. ఇదే స్ఫూర్తితో దేశవ్యాప్తంగా ‘ఏక్ పేడ్ మా కే నామ్‘ (అమ్మ పేరు మీద ఒక చెట్టు) ప్రచారం జరుగుతోందని, ఈ ప్రచారంలో భాగంగా ఇప్పటివరకు దేశంలో 200 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు మోదీ తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెరుగుతోందనడానికి ఇదే నిదర్శనమని ఆయన అన్నారు.

# మాజీ వార్డు కౌన్సిలర్
# గుండ్ల సుజాత మహేందర్‌రెడ్డి సహకారంతో ఉచిత వైద్యశిబిరం

బొల్లారం మున్సిపాలిటీ నవతరం:- బొల్లారం డివిజన్ మాజీ వార్డు కౌన్సిలర్ గుండ్ల సుజాత మహేందర్ రెడ్డి సహకారంతో శుభకర ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసారు.జిహెచ్ఎంసి 272 బొల్లారం డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్ గణేష్ మండపం దగ్గర శుభకర ఆసుపత్రి వారు ఏర్పాటు చెసిన ఉచిత వైద్య శిబిరాన్ని కాలనీ వాసులు చాలామంది సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా బాలాజీ నగర్ కాలనీ మాజీ వార్డు కౌన్సిలర్ గుండ్ల సుజాత మహేందర్ రెడ్డి హాజరై శుభకర ఆసుపత్రి వైద్య సిబ్బందితో కలిసి ముందుగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గుండ్ల సుజాత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చెసిన శుభకర ఆసుపత్రి డాక్టర్స్ రమేష్ ఎంబిబిఎస్,ఎండీ మరియు నాయక్ ఎంబిబిఎస్,వైద్య సిబ్బందిని అభినందినించారు. పేద ప్రజల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చెసిన శుభకర ఆసుపత్రి యాజమాన్యనికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే ప్రతియొక్కరు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రతియొక్కరికి వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యం పట్ల పాటించాల్సిన పలు సూచనలు చేసారు. వైద్య సిబ్బంది, స్థానికులు దమ్మయా నాయుడు, చంద్రారెడ్డి, సందీప్ రెడ్డి, శ్రీహరి,రాజు, మల్లేష్, రవీందర్ రెడ్డి, సోను, సమీర్, సింహాచలం, కాలనీ వాసులు పాల్గొన్నారు.







# చిత్తరమ్మ తల్లిని దర్శించుకున్న కూన శ్రీనివాస్‌గౌడ్

కుత్బుల్లాపూర్, నవతరం: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని గాజులరామారం గల అంగరంగ వైభవంగా జరుగుతున్న ప్రఖ్యాతగాంచిన శ్రీశ్రీశ్రీ చిత్తరమ్మ దేవి జాతరలో భాగంగా ముఖ్యమైన అమ్మవారి జాతర సందర్భంగా పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు కూన శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంటెస్టెడ్ కార్పొరేటర్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, పేదల కొంగుబంగారమైన ఆ చిత్తరమ్మ తల్లి ఆశీస్సులు కృప, కటాక్షాలు, చల్లని దీవెనలు, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరారు. అనంతరం ఆలయ కమిటీ వారు కూన శ్రీనివాస్ గౌడ్ ను శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు. చిత్తరమ్మ దేవి ఆలయ ప్రాంగణమంతా భారీ సంఖ్యలో భక్తులతో కిటకిటలాడుతుంది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించుకుంటూ, తమ మొక్కులను చెల్లిస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్, సభ్యులు బాలరాజు, ఇతర సభ్యులు, స్థానిక డివిజన్ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## బాధ్యతలు చేపట్టిన నూతన ఉపకమిషనర్లు

కుత్బుల్లాపూర్, నవతరం: జిహెచ్ఎంసి పరిధిలో ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా జీడిమెట్ల, గాజులరామారం సర్కిళ్ల ఉప కమిషనర్లు బదిలీ అయిన విషయం తెలిసిందే. వారి స్థానాల్లో జీడిమెట్ల సర్కిల్ నూతన ఉప కమిషనర్ గా డి. శంకర్ సింగ్, గాజులరామారం సర్కిల్ నూతన ఉప కమిషనర్ గా శ్రీపాద రామేశ్వర్ నియమితులయ్యారు. ఈ మేరకు వారు ఆయా సర్కిళ్లలో శనివారం బాధ్యతలు చేపట్టారు. అయితే శంకర్ సింగ్ యూసఫ్ గూడా సర్కిల్ నుంచి, శ్రీపాద రామేశ్వర్ నిజామాబాద్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.





## ఎన్కౌంటర్ చేయకండి సజ్జనార్ గారు!

హైదరాబాద్, నవతరం: సీన్ రీకన్‌స్ట్రక్షన్ పేరుతో మమ్మల్ని తీసుకెళ్లి ఎన్‌కౌంటర్ చేయకండి సజ్జనార్"నాపై సీపీ సజ్జనార్ లేనిపోని ఆరోపణలు చేశారు. నేను పోలీస్ కస్టడీలో ఉన్నందువల్ల అప్పట్లో సమాధానం చెప్పలేకపోయాను. నాకు కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా అరెస్ట్ చేశారు. నేను పారిపోతున్నానని చెప్పడం పూర్తిగా అబద్ధం. నేను 13వ తేదీ రోజంతా ఎన్టీవీ ఆఫీసు, ప్రజాభవన్, సచివాలయంలోనే ఉన్నాను. నా ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ కాలేదు. పోలీసులే నోటీసులు ఇవ్వడానికి వస్తే నేనే వెళ్లి తీసుకున్నాను. అయినా కూడా నేను పారిపోయినట్టు స్టేట్‌మెంట్ ఇవ్వడం తప్పు. నేను నీరవ్ మోడీ, విజయ్ మాల్యా లాంటి వాడిని కాదు. ఒక న్యూస్ విషయంలో ఇలా టార్గెట్ చేయడం న్యాయం కాదు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ పేరుతో మమ్మల్ని తీసుకెళ్లి ఎన్‌కౌంటర్ చేయకండి సజ్జనార్" అంటూ ఎన్టీవీ విలేకరి లలో ఒకరైన దొంతు రమేష్ సోషల్ మీడియా లో ఓ వీడియో రిలీజ్ చేశారు.



## జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకం

**స్వచ్ఛ తెలంగాణ దినపత్రిక క్యాలెండరు ఆవిష్కరించిన**
**తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ హెచ్ 143**
**రాష్ట్ర అధ్యక్షులు, తొలి మీడియా అకాడమీ ఛైర్మెన్ అల్లం నారాయణ**

కుత్బుల్లాపూర్, జనవరి 23 (నవతరం): ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ సమాజ అభివృద్ధికి మీడియా కీలక పాత్ర పోషిస్తుందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర అధ్యక్షులు తొలి మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. శుక్రవారం సూరారం తులీప్ గ్రాండ్ హోటల్ లో అల్లం నారాయణతో అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, రాష్ట్ర కోశాధికారీ అస్కాని మారుతీ సాగర్ ఆధ్వర్యంలో స్వచ్ఛ తెలంగాణ 2026 నూతన దినపత్రిక క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ నిత్యం సమాజానికి నూతన విషయాలను తెలియజేస్తూ జర్నలిస్టులు ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారని అన్నారు. వాస్తవాలను నిర్భయంగా వెలికి తీసి నిస్వార్ధంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడంలో స్వచ్ఛ తెలంగాణ జర్నలిస్టులు ముందుంటారని ఆయన తెలిపారు. స్వచ్ఛ తెలంగాణ దినపత్రికలో పనిచేస్తున్నటువంటి రిపోర్టర్లకు, తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్ హాజరే, రమణ, యోగానంద్, అవ్వారి భాస్కర్, విష్ణు వర్ధన్ రెడ్డి, స్వచ్ఛ తెలంగాణ స్టాఫ్ రిపోర్టర్ జుట్టు సాయిలు, తదితరులు పాల్గొన్నారు.



## హెల్త్ క్యాంపు ను ప్రారంభించిన కేహెచ్ఆర్

కుత్బుల్లాపూర్, నవతరం: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి పరిధిలోని రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ & ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, వేల్యూ మెడ్ హాస్పిటల్ వారి సౌజన్యంతో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి హాజరై క్యాంపును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు మంచి వైద్య సేవలు పొందేలా స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. కొలన్ జీవన్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్, సిద్దనోల సంజీవరెడ్డి, మైసిగారి శ్రీనివాస్, సంఘ అధ్యక్షులు నవీన్, సురేష్, విద్య సాగర్, శ్రవణ్, ఫణింద్ర, వినయ్, రవీందర్, కిరణ్, వైద్యులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# మహేష్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

## తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి



హైదరాబాద్, నవతరం: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలోకి వస్తానంటే నేను వద్దన్నాను అంటూ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆదివారం విలేకరులకు అందజేసిన ఒక ప్రకటనలో ఆయన మహేష్ కుమార్ గౌడ్ తీరుపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక, రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించలేక కాంగ్రెస్ ప్రభుత్వం దిక్కుతోచని స్థితిలో ఉందన్నారు. ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత నుండి దృష్టి మళ్లించడానికే ఇటువంటి అసత్య ప్రచారాలకు తెరలేపారని విమర్శించారు. తెలంగాణ జాగృతి త్వరలో రాజకీయ పార్టీగా అవతరించబోతున్న తరుణంలో, ఆ సంస్థకు వస్తున్న ప్రజాదరణను చూసి భయపడి మహేష్ కుమార్ గౌడ్ సత్యదూరమైన మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పార్టీని చక్కదిద్దుకోలేక, సొంత నాయకత్వాన్ని సమన్వయం చేయలేక సతమతమవుతున్న పీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను గమనించాలని హితవు పలికారు. బురద జల్లే రాజకీయాలు మానుకొని, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి పెట్టాలని సూచించారు.

**కాంగ్రెస్ ఉనికి కోసమే ఆరాటం**

ప్రజల అభిమానాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ, తన ఉనికిని కాపాడుకోవడానికి లేనిపోని అబద్ధాలను ప్రచారం చేస్తోందని, ఇలాంటి చౌకబారు విమర్శలను తెలంగాణ ప్రజలు నమ్మరని పాండురంగారెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతికి ఉన్న నైతిక బలాన్ని దెబ్బతీయాలని చూస్తే ఊరుకునేది లేదని, ఇకనైనా అర్థరహితమైన వ్యాఖ్యలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు.

# రాజ్యాంగమే మనకు మార్గదర్శి..

## రిపబ్లిక్ డే ముంగిట రాష్ట్రపతి ప్రసంగం



గణతంత్ర దినోత్సవ వేడుకలకు దేశం సిద్ధమవుతున్న వేళ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదివారం సాయంత్రం జాతినుద్దేశించి ప్రసంగించారు. న్యాయం, సోదరభావం అనే రెండు కీలకమైన అంశాలను మన రాజ్యాంగం నిర్వచించిందని, అవే గణతంత్రానికి పునాదులని ఆమె స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న దార్శనికత, రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలను ఆమె తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు. దేశాభివృద్ధి ప్రయాణంలో మహిళలు కీలక మైలురాళ్లను సృష్టిస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్నారని రాష్ట్రపతి ప్రశంసించారు. దేశ భద్రతకు కాపలా కాస్తున్న సాయుధ బలగాల శౌర్య పరాక్రమాలను కొనియాడుతూ, 'ఆపరేషన్ సిందూర్'ను ఆమె గుర్తుచేశారు. దేశ పురోభివృద్ధికి దోహదపడుతున్న రైతులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, సైనిక, పోలీసు సిబ్బంది, వ్యాపారవేత్తలు, యువత సేవలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయడానికి ఎన్నికలలో పాల్గొనడం పౌరుల బాధ్యత అని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇచ్చిన సందేశాన్ని రాష్ట్రపతి ఈ సందర్భంగా గుర్తుచేశారు. వందేమాతరం 150వ వార్షికోత్సవ వేడుకలతో పాటు సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్‌లకు నివాళులర్పించిన కార్యక్రమాలను కూడా ఆమె ప్రస్తావించారు. భారత ప్రజాస్వామ్య క్యాలెండర్‌లో అత్యంత ముఖ్యమైన ఈ వార్షిక ప్రసంగం దేశవ్యాప్తంగా కోట్లాది మంది పౌరులకు చేరింది. ఆదివారం రాత్రి 7 గంటలకు ప్రారంభమైన ఈ ప్రసంగాన్ని ఆకాశవాణి జాతీయ నెట్‌వర్క్‌తో పాటు అన్ని దూరదర్శన్ ఛానెళ్లలో ప్రసారం చేశారు. మొదట హిందీలో, ఆ తర్వాత ఆంగ్లంలో రాష్ట్రపతి ప్రసంగించారు. అనంతరం, దూరదర్శన్ ప్రాంతీయ ఛానెళ్లు వివిధ ప్రాంతీయ భాషలలో ఈ సందేశాన్ని ప్రసారం చేశాయి. దీనివల్ల దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రజలు తమ మాతృభాషలో రాష్ట్రపతి సందేశాన్ని వినే అవకాశం కలిగింది. గణతంత్ర భారతదేశం ఆవిర్భవించిన తొలి నాళ్ల నుంచి రాష్ట్రపతి ప్రసంగం ఒక సంప్రదాయంగా కొనసాగుతోంది. ఇది దేశ ప్రగతి, విజయాలు, సవాళ్లను సమీక్షించుకోవడానికి ఒక అవకాశంగా నిలుస్తుంది.


WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com






# ఘనంగా శ్రీశ్రీశ్రీ చిత్తరమ్మదేవి జాతర మహోత్సవాలు





కుత్బుల్లాపూర్, నవతరం: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం పరిధిలో ప్రసిద్ధిగాంచిన శ్రీ శ్రీ శ్రీ చిత్తరమ్మ దేవి జాతర సందర్భంగా, ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ప్రత్యేక పూజల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న ఆయన, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం జాతర నిర్వహణకు సంబంధించి పోలీస్ శాఖ, మున్సిపల్ శాఖలు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.






# భక్తులందరి కరుణించి కాపాడమ్మ

## బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్



కుత్బుల్లాపూర్, నవతరం: గాజుల రామారం డివిజన్ చిత్తారమ్మ దేవి జాతర కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మాట్లాడుతూ... చింతలను తీర్చే చిత్తారమ్మ తల్లి భక్తులందరి కరుణించి కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాచకొండ బాల్ రాజ్, కమిటీ సభ్యులు నర్సింహ ల, శంకర్ రెడ్డి, వంశీ గౌడ్, కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో–ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవి యాదవ్, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అంజన్ గౌడ్, కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, సుంకరి చందు, గోవర్ధన్ రెడ్డి, దూలప్ప, చిన్నా చౌదరి, చంద్రశేఖర్ రెడ్డి, బాబీ చౌదరి, చెట్ల వెంకటేష్, రాములు గౌడ్, సమ్మయ్య యాదవ్, ప్రసాద్, నవీన్, శివా నాయక్, జునైద్, గౌస్, వాహిద్ తదితరులు పాల్గొన్నారు.






Navataram Telugu Daily Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747,
Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State
Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com